కథా నిలయం
శ్రీకాకుళం

# సుబ్బలక్ష్మి శుభ్రత



## 24

తురగా శివరామ వేంకటేశ్వర్లు

కాంబాబు, నేను చిరకాల మిత్రులం. పైగా వాళ్ళావిడ సుబ్బలక్ష్మి నాకు దూరపు చుట్టం. అందుచేత వాళ్ళ కుటుంబంతో నా పరిచయం ఎక్కువే! అందుకే నేను అప్పుడప్పుడు ఆదివారంనాడు సాయంత్రం వేళ వాళ్ళింటికెళ్ళి ఓ రెండు గంటలు కబుర్లు చెప్పి సరదాగా సాయంత్రం వేళ వాళ్ళింటికెళ్ళి ఓ రెండుగంటలు కబుర్లు చెప్పి సరదాగా గడుపుతుంటాను. ఓ ఆదివారం నేవెళ్ళినప్పుడు ఆ వేళ ఎండ ఎక్కువగా ఉండడం వల్ల కాంబాబు స్నానం చేస్తున్నాడు. సుబ్బలక్ష్మి "కూర్చోవయ్యా! ఆయన స్నానం చేసి వచ్చేసరికి టిఫిను, టీ తయారుచేసి తెస్తాను" అంటూ వంటింట్లోకెళ్ళిపోయింది. నేను కూర్చోడమెందుకని ఇల్లంతా తిరిగి చూసొచ్చాను. ఆ ఇంటి శుభ్రత నన్నాకర్షించింది. కాస్సేపటికి టీకప్పు, పకోడీ ప్లేటులు మాముందుంచుతున్న సుబ్బలక్ష్మిని చూస్తూ, "మీ ఇల్లు చాలా శుభ్రంగా, నీట్‌గా ఉందమ్మా!" అన్నాను. కాంబాబుతో, "మా సుబ్బలక్ష్మి నీ పెళ్ళాం అవడం నువ్వు లక్కీరా!! అన్నాను. అప్పుడు సుబ్బలక్ష్మి మొహంలో సంతోషంతో, కళ్ళల్లో గర్వంతో కాంబాబు వైపుకి చూసి మీసం దువ్వుతున్నట్లు ఓమాటు ఫోజిచ్చి, "మీరు కబుర్లు చెప్పుకోండి. నేను బెడ్రూములు రెండూ దులుపుకోవాలి. దులిపి అప్పుడే పదిరోజులయిపోయింది" అంటూ లోపలికెళ్ళి పోయింది.

కాంబాబు బిక్కమొహం వేసుక్కూర్చున్నాడు. "అదేమిటిరా! మీ ఆవిడ్ని పొగుడుతే అల్లా ఉన్నావ్? ఏమిటి సంగతి?" అనడిగాను. "ఏం చెప్పమంటావ్? సుబ్బలక్ష్మి శుభ్రత వెనకాల ఎంత కథ ఉందో! అయినా చెపుతా విను" అంటూ చెప్పడం మొదలెట్టాడు కాంబాబు.

"నేను పెళ్ళి చూపులుకి వెళ్ళినపుడు లోపల గదిలోంచి జబ్బ పట్టుకుని పెళ్ళికూతురు తల్లి అంటే ఈనాటి మా అత్తగారు అమ్మాయిని తీసుకొచ్చి హాల్లో మా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోపెట్టింది. పెళ్ళివారు పెట్టిన స్వీట్లు తింటూ మా అమ్మ, నాన్న "అమ్మాయికి వంటచేయడం వచ్చా?" అని అడగ్గా "వచ్చండీ! మా అమ్మాయికి శుభ్రం కూడా ఎక్కువే!" అన్న ఆవిడ మాటలు ఏదో మాటవరసకి అన్నవే అనుకున్నాను. మా అబ్బాయిల చిన్నప్పుడు మా ఇంటికి చుట్టాలు వచ్చి రెండు రోజులుండి వెళ్ళేటప్పుడు, "మీ ఆవిడ పిల్లల్ని చక్కగా పెంచుతోందిరా! శుభ్రం కూడా ఎక్కువే" అన్నప్పుడు నేను వాళ్ళ ఎదురుగా కాలరు ఎగరేసేవాడ్ని. మా బామ్మ నన్ను పిలిచి, "మీ ఆవిడకి ఎంత శుభ్రం అనుకున్నావ్! బట్టలు ఎంత బాగా ఉతుకుతోందో, బట్టలకి గంజి కూడా బాగా పెడుతుంది. మన ఇంటి చాకలి మీ ఆవిడ్ని చూసి సిగ్గు తెచ్చుకుంటోంది" అన్నప్పుడు పొంగిపోయాను. కాని ఆ శుభ్రం సుబ్బలక్ష్మి వయస్సుతో పాటు పెరిగి పెరిగి ఈ వేళ నా జేబుకి చిల్లుపెడుతూ విన్నవాళ్ళను నవ్విస్తుందనుకోలేదురా!

నెలకి ఏడువందలు ఇవ్వడానికి రోజూ ప్రొద్దున్న ఏడు గంటలకి రావడానికి గుమ్మంకడిగి, గదులు ఊడ్చి, అంటులు తోమి, బట్టలు ఉతకడానికి పనిమనిషి అప్పల నర్సమ్మను కుదిర్చాను. అయితే సుబ్బలక్ష్మి, ఆరున్నరకే లేచి ఏడు గంటలవరకు పని మనిషి కోసం చూసి కంగారుపడడం, "ఇపుడేకదా ఏడయింది. పదినిముషాలు ఇటో అటో అవుతుంది కంగారు పడకోయ్!" అంటే, "ఏవండీ! పాచి గుమ్మం కడుక్కోకుండగా ఎల్లా ఉంచుకుంటావండీ" అంటూ తను వీధిగుమ్మం కడుక్కుని, గదులు ఊడుస్తుంటే ఏడు పదిహేనుకి వచ్చిన పనిమనిషి చేతికి చీపురిచ్చి దీన్ని లోపల పెట్టు! ఇపుడా రావడం?" అనడం నెలకి పదిహేను రోజులు జరిగేదే! అంటులు తోమి, బట్టలుతికి, "వెళ్ళొస్తాను అమ్మగారూ!" అన్న అప్పలనర్సమ్మ మాటలు విని సుబ్బలక్ష్మి తలుపులేసుకుని పెరట్లోకెళ్ళి ఆ తోమిన గిన్నెలకు, గ్లాసులకు విమ్ము పొడరు పెట్టి మళ్ళీ నీళ్ళతో ఒక్కొక్కటిని కడగడం, తొలవడం చూసి నేను, "ఎందుకే.... శుభ్రంగా తోమి కడిగిన వాటిని మళ్ళీ కడుగుతావ్?" అనంటే, "ఏమండీ! పనిమ్మాయిలు డబ్బు పుచ్చుకోవడమే గాని వాళ్ళు వొళ్ళు వంచి పనిచేస్తారా? అయినా మీ వాళ్ళలాగ నాకు ఎడ్డితనం లేదు. నా శుభ్రం నాదే..... గిన్నెల్లో ఎక్కడైనా అన్నం మెతుకులుండి పోవచ్చు. పాలగిన్నెలో తొరకలుండిపోవచ్చు. చూడండి. ఈ గ్లాసులో కాఫీ వాసన పోనేలేదు" అంటూ తన పని తను చేసుకుపోవడం చూసి నేను తల పట్టుక్కూర్చోవడం మామూలే!

తోమిన గిన్నెలను తోమడంతో సరిపెట్టుకుంటే ఫర్వాలేదు. ఉతికిన బట్టల్ని ఒక్కొక్కటీ తీసి, మళ్ళీ నీళ్ళల్లో సర్ఫు వేసి కాలరు దగ్గర నలుపు ఇంకా వదల్లేదనీ, టీ మరకలు పూర్తిగా పోలేదని, ఆవకాయ కర్రు ఎరుపు కొంచెం ఉందని అనుమానంతో రిన్ సబ్బు పెట్టి జాడిస్తుంటే చూసి నేను దిగాలుగా ఉండడం అలవాటు. మా వీధిలో చంద్రయ్యగారిక్కూడా నేను అప్పలనర్సమ్మనే పనిమనిషిగా కుదర్చడం వల్ల, ఆయన నాకు కనపడినప్పుడల్లా "మంచి పనిమనిషిని కుదిర్చి పెట్టేవయ్యా! బట్టలు, గిన్నెలు ఎంత శుభ్రంగా ఉంటున్నాయో! థ్యాంక్స్! చెప్పుతుంటే విన్నాక లోపల చిన్న ఏడుపు వస్తుందిరా! నాకు ఎందుకో!.

చొక్కా నలగని ఉద్యోగం చేస్తున్న నన్ను, మనసుపడి కుట్టించుకున్న బట్టల జతను సుబ్బలక్ష్మి ఎప్పుడూ రెండు రోజులు వరుసగా వేసుకోనివ్వ లేదురా!. సాయంత్రం ఆఫీసునుంచి వచ్చి హేంగరుకు తగిలించిన బట్టలు జత తెల్లారయ్యేసరికి వాషింగు మెషీన్లో నాని ఉండవలసిందే. మా కజిన్ నాతో పనుండి ఓ రాత్రి మా ఇంటికి వచ్చి నాకున్న కలరులాంటి తన బట్టల జతను హేంగరుకు తగిలించి లుంగీతో పడుకుంటే తెల్లవారు ఝామున పొరపాటున ఆ బట్టలు నావే అనుకుని సుబ్బలక్ష్మి ఉతకడానికి నానపెట్టేయడం ఆ తర్వాత పని మనిషి వచ్చాక ఉతికించి ప్రొద్దున్నే వాటిని ఆరేసినా, వర్షం పడడం వల్ల సాయంత్రం వరకు అవి ఆరకపోవడం, నా బట్టలు వాడి సైజుకి సరిపోకపోవడం, వాడు ఆఫీసుకి శలవు పెట్టి ఆ రోజుంతా లుంగీతో మా ఇంట్లో ఉండిపోయిన సంఘటన తలుచుకుని ఫోను చేసి మరీ నవ్విస్తూ ఉంటాడు వాడు.

ఒక రోజున బ్యాంకు పని చేసుకుని మధ్యాహ్నం ఒంటిగంటకు ఎండలో ఇంటికి వచ్చి "ఒక గ్లాసుడు మంచి నీళ్ళు ఇవ్వవోయ్" అని అడిగితే, "మీరే తెచ్చుకుని తాగండి. అన్నం కూడా మీరే పెట్టుకుని తినండి! ఈవేళ. పొద్దున్నుంచి చాకిరీతో నలిగిపోయాను". అన్న సుబ్బలక్ష్మి జవాబు విని ఆశ్చర్యపోయి ఏం చేశావు?" అని అడిగితే, "పొట్టైపోయిన మీవీ, పిల్లలవి లాగూ, చొక్కాలూ, నా వెలిసిపోయిన చీరలు నాలుగు మూటలు కట్టి నాలుగు నెలలు క్రితం నాలుగు రేక్కల్లో పడేశాను గదా. అవి దుమ్ము పట్టి మాసిపోయాయి. వాటిని శుభ్రంగా ఉతికా, ధర్మానికైనా, స్టీలుగిన్నెలు వాడికైనా మాసినవి ఎల్లా ఇస్తాం?. అందుకే నా ఒళ్ళు హూనమయింది ఈ వేళ. సాయంత్రం బజారుకెళ్ళి ఐదు కె.జిలు సర్ఫు సొడర్, డజను పెద్ద రిన్ సబ్బులు, నాలుగు నీలిమందు డబ్బాలు తెచ్చిపెట్టండి. మొన్న తెచ్చినవి అయిపోయాయి" అని చెప్పి నీరసంగా పడుకుంది. మా రెండోవాడు ఈమధ్య ఒకసారి, "నాన్నా! అమ్మ క్రిందటి జన్మలో బొంబాయి లాంటి మహానగరంలో అతి పెద్ద లాండ్రిలో పనిచేసి ఉంటుంది" అని హాస్యంగా అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

'యురేకా' కంపెనీ రిప్రెజెంటేటివ్ వాక్యూమ్ క్లీనరు డిమాన్‌స్ట్రేషన్ చేసి చూపిస్తానని నా దగ్గరికి నాలుగుసార్లు వచ్చినప్పుడు సుబ్బలక్ష్మిని అతను కలవకుండగా జాగ్రత్తపడి పంపించేశాను. కాని నేను క్యాంపుకి వెళ్ళినప్పుడు అతను వచ్చి డిమాన్‌స్ట్రేషన్ చేసి చూపించడం, నేను క్యాంపు నుంచి రాగానే, "యురేకావారి వ్యాక్యూం క్లీనరు కొందామండి! అది మన సోఫాల్లో, పరుపుల్లో, కార్పెట్లో అణువణువునా ఉన్న దుమ్ము తీసేస్తుందిట. ఇంతా చేస్తే దాని ఖరీదు ఎనిమిదివేలేటండీ!" అని అడగడం నేను చేసేది లేక ఆర్డరు ఇవ్వడం వెంటవెంటనే జరిగిపోయాయి. వాక్యూం క్లీనరు ఇంటికొచ్చింది. దాన్ని ఒక నెల రోజులు వాడేము. అణువణువునా ఉన్న దుమ్ము పోయిందో లేదో నాకు తెలియదు కానీ తర్వాత అది పనిచేయడం మానేసింది. యురేకామనిషి మొబైల్ నెంబరుకి ఫోన్ చేసి రప్పిస్తే అతను వచ్చి "ఇది ఇంతకంటే ఎక్కువ కాలం పని చేయదండీ! మీకిచ్చిన పీసు నాలుగేళ్ళ నుంచి డిమాన్‌స్ట్రేషన్కి వాడుతున్నది. దీని లైఫ్ అయిపోయింది. దానిక్కారణం మీ వైఫే! కొత్త సరుకు రెడీగా లేదంటే వినకుండగా మీ వైఫ్ నా పైఆఫీసరుకి పదే పదే ఫోన్ చేసి అర్జంటుగా డెలివరీ చేయమని ఒత్తిడి తేవడంతో ఈ పీసుని నేనే కొత్త బాక్సులో పేక్ చేసి డెలివరి చేశాను సర్" అని చెప్పగా, నేను తల పట్టుకుని "సరేలేవయ్యా! ఇప్పుడు దీన్ని పట్టుకుపోయి కొత్తది ఇవ్వు" అని రిక్వెస్ట్ చేస్తే, "లేదు సార్! ఇప్పుడు నేను ఆ పని చేయలేను. ఎందుకంటే యురేకా కంపెనీలో రిజైన్ చేసి 'గొరేకా' కంపెనీలో మొన్ననే జాయనయ్యాను. ఏదో మీరు పిలిచారని వచ్చానంతే!" అన్నాడు. వెర్రిమొహం వేసి ఒక చెంబుతో నీళ్ళు తెచ్చుకుని చేతిలో పోసుకుని ఎనిమిదివేలు యురేకా వాడికి తర్పణం వదిలేను. ఒకరోజు నేను బైటికెళ్ళి ఇంటికొచ్చేసరికి తలకి గుడ్డ కట్టుకుని సుబ్బలక్ష్మి బూజుకర్రతో ఇల్లు దులుపుతోంది. "ఎందుకోయ్ ఇది ఇప్పుడు? రేపు హైదరాబాద్ అబ్బాయింటికి పండక్కి వెళ్ళుతుంటే. నెలరోజులు వరకు రాంగదా? వచ్చాక దులుపుకోవచ్చు. బూజు కూడా ఎక్కడా వున్నట్లు లేదు. ఉండడానికి దాన్ని ఎప్పుడైనా ఉండనిచ్చావా, బ్రతకనిచ్చావా?" అన్నాను. "మీ కళ్ళకి ఏమీ కనపడవ్ లెండి. మీరు కాఫీ పెట్టుకుని తాగండి" అంటూ చకచకా దులుపుకుంటూ వెళ్ళిపోయింది.

"ఏమండీ! భుజాలు లాగుతున్నాయి, చేతి నరాలు పోటువస్తున్నాయి. వేళ్ళు వంగనివ్వట్లేదు. మీకు ఎన్నిసార్లు చెప్పినా నా ఆరోగ్యం గురించి పట్టించుకోట్లేదు" అని కళ్ళమ్మట నీళ్ళు తెచ్చుకుంది సుబ్బలక్ష్మి ఒకరోజు రాత్రి నా ప్రక్కన పడుకుని, మర్నాడు గంగోత్రి హాస్పిటల్లో అపాయింటుమెంటు తీసుకుని ఆవిడబాధలు డాక్టరు గార్కి చెప్పగా, ఆయన వ్రాసి ఇచ్చిన మెడికల్ టెస్టులు చేయించి పదివేలు బిల్లు కట్టాను. రెండు రోజులు తర్వాత ఇచ్చిన రిపోర్టులు తీసుకెళ్ళి డాక్టరుగార్కి చూపించగా వాటిని ఆయన తన కళ్ళజోడులోంచి చూసి చూసి "మీ ఆవిడ బాధలు ఏమిటన్నారు?" అని అడిగారు. "మొన్న చెప్పాను కదా.... అవి వినే కదా ఇన్ని టెస్టులు చేయించమన్నారు.

మళ్ళీ ఇప్పుడు అడగడంలో మీ ఉద్దేశ్యమేమిటి సార్? పొరపాటున అక్కరలేని టెస్టులు చేయించలేదు కదా?" అని కంగారుగా అడిగాను. "కాదులేవయ్యా!..... ఒక ప్రశ్న వేస్తాను సూటిగా జవాబు చెప్పు. మీ ఆవిడకి అంటులు తోమడం, బట్టలుతకడం, ఇంటి పనులు చేసుకునే అలవాటు ఉందా? అని అడిగారు. "ఉంది సార్" అన్నాను. "ఐతే ఆ పనులు పనిమనిషితో చేయించుకోమనండి. ఇదే! నా ప్రిస్క్రిప్షన్" అని తర్వాత టోకెన్ నెంబర్ని పిలిచేశాడు డాక్టరుగారు. సుబ్బలక్ష్మికి వారపత్రికలు చదవడం, టి.వి.చూడడం బాగానే అలవాటుందిరా! వాటిల్లో వ్రాసే 'ఇల్లు శుభ్రంగా ఎల్లా ఉంచుకోవాలి? చెత్త ఎక్కడ వెయ్యాలి, స్నానం ఎల్లా చేయాలి? జుట్టు ఎలా ఆరపెట్టుకోవాలి? వంట ఎల్లాచెయ్యాలి? లాంటి విషయాలు చదివి, 'ఈ రోజుల్లో ఇవన్నీ వ్రాస్తున్నారు గాని మా చిన్నప్పుడు మేము ఏం చదివి నేర్చుకున్నాం, కలికాలపు రోజులివి' అంటూ ఓ నిట్టూర్పు విడుస్తుంది. ఇదిరా! సుబ్బలక్ష్మి శుభ్రత కథ" అంటూ ముగించాడు.

"బాగుందిరా! ఈవేళ నేను నవ్విన నవ్వుకి సుబ్బలక్ష్మి పెట్టిన పకోడీలు, టీ ఎప్పుడో అరిగిపోయాయి" అని చెప్పి మళ్ళీ టీ పెట్టించుకుని ఓ కప్పు తాగి ఇంటికి బయలుదేరాను.

కాలం వేగంగా, హాయిగా గడిచిపోతోంది. 'ఏభై, అరవై సంవత్సరాలు వయస్సు దాటిన స్త్రీ, పురుషులు ఏడాదికి ఒకసారి 'మాస్టర్ హెల్త్ చెకప్ చేయించుకోవాలి' అనే డాక్టర్ సలహాలు, టి.వి. ప్రకటనలు, హాస్పటల్లో డిస్కౌంటు బేనర్లు చూసి, "సుబ్బలక్ష్మికి ఒకసారి మాస్టర్ హెల్త్ చెకప్ చేయించరా!" అని ఇటీవల వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు సలహా ఇచ్చాను కాంబాబుకి. పదిహేను రోజులు పోయాక కాంబాబు బజారులో కనబడి, "హెల్తు చెకప్ చేయించానురా. సుబ్బలక్ష్మి రిపోర్టులు చూసి డాక్టరుగారు ఏమన్నారో తెలుసా? 'ఏవమ్మా! నేను రోజూ చాలామంది ఆడవాళ్ళ మెడికల్ రిపోర్టులు చూస్తూ సలహాలిస్తూ వుంటా. కాని మీ వయస్సుగల ఏ ఒక్క స్త్రీకి ఈ మధ్యకాలంలో ఇంత బెస్టు రిపోర్టు చూడలేదు. కంగ్రాట్యులేషన్స్! కీపిటప్! మీకు బాగా కష్టపడే అలవాటు ఉన్నట్లుంది' అన్నార్రా? ఎరోయ్! నువ్వన్నట్లుగా సుబ్బలక్ష్మి నాకు పెళ్ళాం అవడం నేను లక్కీయేరా! నా మనసులో మాట చెపుతున్నా!" అన్నాడు కాంబాబు ఉద్వేగంగా. "అంతేకాదు కాంబాబూ! ఇంటి, వంటి శుభ్రత పట్టించుకోకుండా బద్ధకం పెంచుకుని, టి.విల ముందు ఎప్పుడూ ఏదో తింటూ సీరియల్స్ చూస్తూ కూర్చునే ఆడ, మగ వాళ్ళకి సుబ్బలక్ష్మి శుభ్రతలో ఓ సందేశం కూడా ఉందిరా!" అని నేను అనడంతో "దూరపు చుట్టం అయినా సుబ్బలక్ష్మి నీకు చెల్లెలు వరసకదరా! ఎంతైనా పొగుడుతావ్ నువ్వు!" అన్న కాంబాబు మాటలకి ఇద్దరం గట్టిగా నవ్వుకున్నాం.